
క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి కెనరా బ్యాంక్ వితరణ



వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న వైస్ చైర్మన్ అరుణ

బాలాజీచెరువు: కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ (సీబీఈయూ) 74వ అవిర్భావ దినోత్సవం సందర్భంగా కాకినాడ యూనిట్ ఆధ్వర్యంలో గాంధీనగర్ జనావళి వృద్ధాశ్రమానికి రెండు నెలలకు సరిపడా నిత్యవసర వస్తువులు, పండ్లు, వాటర్ డిస్పెన్సర్, ఫ్యాన్‌లు అందజేశారు. యూనియన్ రాష్ట్ర వైస్ చైర్మన్, సెంట్రల్ కమిటీ సభ్యులు పి.అరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రీజనల్ ఆఫీస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.గణేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే పెద్దాపురంలో మన ఇల్లు ఆశ్రమానికి నాలుగు సీలింగ్ ఫ్యాన్లు అందజేసారు. యూనియన్ కార్యదర్శి శ్రీధర్, సభ్యులు యు.రాంబాబు,లక్ష్మి, రామకుమారి, సూర్య, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతా

కాకినాడ: రానున్న ఎన్నికల్లో మూడోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కాకినాడ సిటీ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన ఎన్నికలపై తన మనోగతాన్ని వెల్లడించారు. గడచిన ఐదేళ్లలో అభివృద్ధి- సంక్షేమానికి సమాన ప్రాధాన్యమిచ్చి అర్హతే ప్రామాణికంగా ప్రజలకు ప్రభుత్వ ఫలాలను అందించామన్నారు. ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చే కొండయ్యపాలెం ఫ్లై ఓవర్‌ను వినియోగంలోకి తేవడం, రాగిరెడ్డి కళాక్షేత్రం, సైన్స్‌సెంటర్, వైఎస్సార్ స్కేటింగ్ రింక్ నిర్మించామన్నారు. తాను మరోసారి ఎమ్మెల్యేగా నెగ్గిన వెంటనే ఇళ్ల పట్టాలు ఇచ్చిన 30 వేల మందికి 2025 డిసెంబర్ నాటికల్లా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి సొంతింటికలను సాకారం చేస్తానన్నారు. జగన్నాథపురం ప్రాంతంలో మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.45 కోట్ల వ్యయంతో నీటి శుద్ధి ప్లాంట్, నేరుగా పైపులైన్ నిర్మాణం చేపడతానన్నారు. అలాగే ఓఎన్‌జీసీ కార్యకలాపాల వల్ల నష్టపోతున్న ప్రతి మత్స్యకారునికి నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానన్నారు.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, కాకినాడ సిటీ నియోజకవర్గం

నేను మళ్లీ ఎమ్మెల్యేనైతే..

పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తా



కాకినాడ రూరల్: జిల్లాలో కాకినాడ రూరల్ నియోజకవర్గం కీలకంగా ఉంది. విశాల సముద్ర తీరంతో పాటు పరిశ్రమలకు నెలవైన ఈ ప్రాంతంలో పారిశ్రామిక ప్రగతికి ప్రాధాన్యమిస్తా. తద్వారా యువతకు ఉద్యోగాలు కల్పిస్తాను. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాను. ఓటు కోసం ప్రజలను మోసం చేసే చంద్రబాబు, కూటమి పార్టీలను నమ్మకుండా చెప్పిన విధంగా నవరత్న పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రజలకు అండగా నిలవాలి. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవంతో కాకినాడ రూరల్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాను.

– కురసాల కన్నబాబు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, కాకినాడ రూరల్ నియోజకవర్గం

ఒడ్డెక్కించే ఓటే లక్ష్యంగా..



ఓటు అభ్యర్థిస్తున్న కురసాల శ్రీ విద్య



ప్రచారంలో పాల్గొన్న ద్వారంపూడి కుమార్తెలు (ఫైల్)

- ప్రజాక్షేత్రంలోనే అభ్యర్థులు
- హోరెత్తిస్తున్న ప్రచారం
- నిత్యం సమావేశాలతో బిజీ
- నేటితో ప్రచారానికి స్వస్తి

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి మరో రోజు సమయం మాత్రమే ఉంది. గడువు దగ్గర పడుతుండడంతో ప్రధాన పార్టీలైన వైఎస్సార్ సీపీ, కూటమి తదితర పార్టీల ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకూ నిత్యం సమావేశాలతో బీజీగా ఉంటున్నారు. కాకినాడ లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వాటన్నింటినీ ఇప్పటికే అభ్యర్థులు చుట్టి వచ్చారు. అయినా మరోసారి ఓటర్లను కలిసేందుకు నిత్యం తిరుగుతున్నారు. గ్రామాల్లో ఉదయం, సాయంత్రం అభ్యర్థుల కుటుంబ సభ్యులు, ద్వితీయ శ్రేణి నాయకులతో ప్రచారం చేయిస్తున్నారు. అలాగే రాత్రి సమయాల్లో నియోజకవర్గాల్లో ప్రధాన కూడళ్లలో కార్నర్ మీటింగ్‌లు పెడుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన ప్రధాన నాయకులు నియోజకవర్గాల్లో పార్టీల అభ్యర్థులకు మద్దతుగా పలుసార్లు ప్రచారం నిర్వహించారు. సమయం దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థులందరూ నియోజకవర్గ కేంద్రాల్లో ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.

గడప గడపకూ ప్రచారం

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గత ఐదేళ్లలో వారు చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్తూ ప్రజల మద్దతు కూడగడుతున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ప్రతి నిమిషం ప్రజల్లోనే గడుపుతూ ప్రజాక్షేత్రంలో ఉంటూ రాత్రి పొద్దుపోయాకే ఇంటికి వస్తున్నారు. ఉదయం బయటకు వెళ్లిన అభ్యర్థులు, నాయకులు భోజనం, అల్పాహారాలు సైతం కార్యకర్తలు, నాయకుల ఇంటివద్దనే చేస్తున్నారు.

నిద్రాహారాలు మానుకుని

ప్రచార సమయం సమీపిస్తుండడంతో ప్రధాన పార్టీ అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారు. ప్రతి నిమిషం విలువైంది కావడంతో నేతలు ఓట్లు ఎలా రాబట్టుకోవాలో ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. నిద్రాహారాలు మానుకుని ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు గ్రామాల్లో ప్రచారం చేస్తున్న అభ్యర్థులు రాత్రి ఏడు గంటల నుంచి 10 గంటల వరకు నియోజకవర్గాల్లో కార్నర్ మీటింగ్‌లు పెట్టి తాము చేసిన పనులను వివరిస్తున్నారు.

హోరెత్తుతున్న మైకులు

ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో మైకులతో హోరెత్తిస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు వివిధ వాహనాలను ఏర్పాటు చేసుకుని డీజే మోతలతో వివిధ రకాల పాటలు ప్రచారం చేస్తున్నారు. ప్రతి గ్రామం, మున్సిపాలిటీల్లో తిరుగుతూ ప్రజలకు పాటల ద్వారా ఆయా పార్టీల లక్ష్యాలను, అవతలి పార్టీల వైఫల్యాలను వివరిస్తున్నారు. ఇంటింటికీ కరపత్రాలను అందిస్తున్నారు.

నేటితో ప్రచారం బంద్

సాయంత్రం 5 గంటల నుంచి మైక్‌ల మూగనోము

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల పోరులో బరిలో ఉన్న అభ్యర్థుల ప్రచారానికి శనివారంతో తెరపడనుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సాయంత్రం 5 గంటలతో మైక్‌లు మూగబోనున్నాయి. నియోజకవర్గంలో సుమారు 2.69 లక్షల ఓటర్లు ఉండగా 264 బూత్‌లు ఉన్నాయి. 15 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అధికార వైఎస్సార్ సీపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పోటీలో ఉన్నారు. ప్రత్యర్థికి అందనంత ఎత్తులో ప్రచారంలో ముందున్న ఆయన శుక్రవారం కరప మండలంలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. మరో వైపు ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు పోటీ పడుతున్నారు. తాయిలాలు ఎరవేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

ప్రజల్లో.. ప్రజలతో.. ప్రజల కోసం..

- అహరహం ముందంజలో ప్రచారం
- అడుగడుగునా విశేషాదరణ
- మా మద్దతు మీకేనంటూ భరోసా
- విజయం వైపు వడివడిగా ద్వారంపూడి



ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడికి బ్రహ్మరథం పట్టిన ప్రజలు (ఫైల్)

కాకినాడ: మరో మూడు రోజుల్లోకి ఎన్నికలు వచ్చేశాయి. ప్రధాన పార్టీలతో సహా చిన్నా చితకా పార్టీలు ప్రజలను చేరువ చేసుకోవడంలో తలమునకలైపోయారు. ప్రధానంగా వైఎస్సార్ సీపీ, కూటమి అభ్యర్థుల అభిమానులు, శ్రేణులు పగలనక రాత్రనక ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కానీ ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు, ప్రగతిని చూసిన ప్రజలు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వైపే మొగ్గు చూపుతూ మళ్లీ సంక్షేమ సారథిని ముఖ్యమంత్రిని చేయాలని కంకణం కట్టుకున్నట్టుగా సర్వత్రా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నిజానికి రెండేళ్ల క్రితం నుంచే గడప గడపకూ వైఎస్సార్ సీపీ, వై ఏపీ నీడ్స్ జగన్ వంటి కార్యక్రమాలతో ప్రజల మధ్యే ఉంటూ వారిలో ఒకరిగా ఓ ఆత్మీయ బంధాన్ని ఏర్పరచుకున్నారు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి. తాజాగా ఎన్నికల ప్రచారంలో 'సైల్' మార్చి పార్టీ ముఖ్యనాయకులు, డివిజన్ కన్వీనర్లు, గృహ సారథుల పర్యవేక్షణలో తమ్ముడు, భార్య, కుమార్తెలు, అల్లుళ్లతో నగరం నలువైపులా ప్రణాళిక బద్ధంగా ప్రచారం చేస్తున్నారు.

చేసిన అభివృద్ధే అజెండా

గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంతో పాటు, గత తెలుగుదేశం హయాంలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలు, టీడీపీ మాజీ ఎమ్మెల్యే కొండబాబు వైఫల్యాలను వివరిస్తూ.. వర్గాలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన విధానాన్ని ప్రజలకు వివరిస్తున్నారు. 2019కి ముందు, ఆ తరువాత జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుని తనను మూడోసారి గెలిపించాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు.

ఇళ్ల స్థలాలతో మంచి స్పందన

కాకినాడకు చెందిన 30 వేల మంది పేదలకు ఇళ్లు ఇప్పించిన అంశం ఆయన విజయానికి మరో ప్రధానాస్త్రం కానుంది.

మత్స్యకారుల్లోనూ చక్కని స్పందన

సాటి మత్స్యకార వర్గాన్ని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వనమాడి కొండబాబు పూర్తిగా నిర్లక్ష్యం చేసిన నేపథ్యం ఆ వర్గానికి సైతం భరోసాగా నిలిచారు ద్వారంపూడి. ఏటిమొగ, దుమ్ములపేట వంటి ప్రాంతాల్లో గత ఎన్నికల్లో తనకు మెజార్టీ ఇవ్వకపోయినా రాజకీయాలకు అతీతంగా ఆ ప్రాంతాల ప్రగతికి ఆయన తోడ్పడ్డారు. ఓఎన్‌జీసీ పరిహారం విషయంలో ఆయన ముందుండి ఉద్యమాన్ని నడిపించారు. ఇవిలా ఉంటే తనదైన వ్యవహారశైలితో కార్మికులతో పాటు, ఇతర వర్గాలకు కూడా సముచిత ప్రాధాన్యం ఇస్తూ సమస్యల పరిష్కారంలో ఆయన తీసుకున్న చొరవ ప్రజలకు మరింత దగ్గరయ్యేలా చేసింది. మొత్తం మీద ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడి మిగిలిన వారితో పోలిస్తే చాలా ముందున్నారని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమవుతోంది.



బైక్ మెకానిక్‌ను ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి (ఫైల్)

చిరుజల్లులతో చల్లబడిన వాతావరణం



కాకినాడలో మబ్బుగా ఉన్న వాతావరణం

కాకినాడ రూరల్: వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. ఇంట్లోంచి బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు చల్లబడిన వాతావరణంతో సేద తీరారు. కాకినాడ రూరల్‌లో శుక్రవారం చిరు జల్లుల నుంచి ఓ మోస్తారుగా వానలు పడడంతో నేల చల్లబడింది. ముఖ్యంగా ఎన్నికల ప్రచారంతో ఎండ తీవ్రతకు ఉక్కిరి బిక్కిరవుతున్న అభ్యర్థులు, పార్టీల కార్యకర్తలకు చల్లారిన వాతావరణంతో ఊపిరి పీల్చుకున్నారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం



వాకాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: గడప గడపకూ సంక్షేమాన్ని అందించి, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఆ పార్టీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు కోరారు. మండలం శివారు ఆర్‌కే నగర్‌కాలనీ, పేపకాయలపాలెంలో జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, ఎంపీటీసీ మద్దూరి భవానీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, రాయుడు శ్రీనివాస్, బైలపాటి నూకరాజు, వాకాడలో సర్పంచ్ అడబాల సత్య, ఎంపీటీసీ చక్కపల్లి ఫకీర్రావు, అడబాల ప్రసాద్, బుచ్చిబాబు, ఈశ్వరరావు, పెదకొత్తూరులో సర్పంచ్ చింతా నాగలక్ష్మి, బోడిశెట్టి చంటి, చింతా బుజ్జి, వేళంగిలో సర్పంచ్ సవిలే నీలిమ, ఎంపీటీసీలు కొప్పిశెట్టి మంగయ్యమ్మ, ముసిని సూరిబాబు, జీలకర్ర దుర్గారావు, సవిలే రాజేష్, సానా శ్రీను, జల్దాని రాంబాబు, కె.గుణ తదితరులు వెంటరాగా మండల నాయకులతో కలిసి ఎమ్మెల్యే కన్నబాబు ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలనచేశారని, మేలు చేసిన ప్రభుత్వానికి అండగా నిలబడాలన్నారు. టీడీపీ, బీజేపీ, జేఎస్‌పీలు ఎన్నికల ముందువరకూ ఒకరినొకరు విమర్శించుకుని, ఎన్నికల వచ్చేసరికి అధికారం కోసం ఒకటయ్యారని, వారి మాయమాటలు, మోసపూరిత హామీలను నమ్మవద్దన్నారు. సీఎం జగన్ ప్రోద్బలంతో గ్రామాల్లో ప్రజల అవసరాలు గుర్తించి, దానికి అనుగుణంగా రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామని, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు, అంబేద్కర్ విగ్రహాలకు షెల్టర్లు నిర్మించామని, ఆలయాలు, పాఠశాలలు ఆధునీకరించామని, సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలకు భవనాలు నిర్మించడం, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు వంటి అభివృద్ధి పనులు చేయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామన్నారు. మరింత మేలు జరగాలంటే ఈనెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండుసార్లు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కన్నబాబు ఓటర్లను అభ్యర్థించారు. ఓటర్లకు అవగాహన కల్పించేందుకు బ్యాలెట్ నమూనాను, ఫ్యాన్ చూపించి ఎమ్మెల్యే కన్నబాబు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సతీమణి శ్రీవిద్య, ఎమ్మెల్సీ కల్యాణి ప్రచారం

కరప: మహిళల అభ్యున్నదే ధ్యేయంగా సీఎం జగన్ పాలనచేశారని, మహిళలు మరింతగా అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర మహిళావిభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సతీమణి శ్రీవిద్య కోరారు. శుక్రవారం కరప మండలం గొడ్డటిపాలెం, కరప, కొంగోడు, పెద్దాపురప్పాడు తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఎమ్మెల్యేగా కన్నబాబు చేసిన అభివృద్ధి పనులు, అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తూ ఈనెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై రెండుసార్లు ఓటేసి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కురసాల కన్నబాబు, చలమలశెట్టి సునీల్‌లను గెలిపించి, జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని వారు ఓటర్లను అభ్యర్థించారు.



కరపలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ కల్యాణి, ఎమ్మెల్యే కన్నబాబు సతీమణి శ్రీవిద్య

'బార్' ప్రధాన పదవులు ఏకగ్రీవం

- ఉపాధ్యక్షుడి పదవికి పోటీ
- నేడు నామినేషన్ ఉపసంహరణ
- ఈ నెల 17న ఎన్నిక

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ 2024-25 ఎన్నికల్లో కొన్ని ప్రధాన పదవులకు సింగిల్ నామినేషన్ పడడంతో అవి ఏకగ్రీవమైనట్టే తేలిపోయింది. మరో ఉపాధ్యక్ష పదవికి రెండు నామినేషన్లు దాఖలు కావడంతో పోటీ అనివార్యమైంది. ఈ నెల 17న ఆ పదవికి ఎన్నిక నిర్వహించనున్నారు. శనివారం నామినేషన్లకు గడువుగా నిర్ణయించారు. బార్ అసోసియేషన్‌లో 1885 మంది సభ్యులు ఉండగా, సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ (సీఓపీ) ప్రకారం 1334 మంది ఉన్నారు. సభ్యత్వం రుసుం చెల్లించినవారు 980 మంది ఉండడంతో వీరికి కూడా ఓటువేసే అర్హత ఉంది.

పాతవారికే అవకాశం

2023-24 సంవత్సరానికి బార్ అసోసియేషన్‌కు అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, చక్కా ఎస్‌వీఎస్ శ్రీనివాస్ ఇతర కార్యవర్గం ఏడాది పాటు సేవలందించారు. 2024-25 సంవత్సరానికి తిరిగి వీరికే అవకాశం దక్కింది. ప్రస్తుతం జరిగే ఎన్నికలకు అధ్యక్షుడిగా ముత్తింటి విశ్వేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా పాశం శంకర్ శ్రీనివాస్, కోశాధికారిగా వెంకట్ రెడ్డి బహదూర్ షా, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా డి.అశోక్‌కుమార్, లైబ్రరీ సెక్రటరీ కె.దయానంద్‌రాజు, సూపర్ సీనియర్ కమిటీ మెంబర్‌గా ఏవీసీహెచ్‌ఎస్ఎస్ మూర్తి, సీనియర్ కమిటీ మెంబర్‌గా జీవీ దుర్గాప్రసాద్, లేడీ రిప్రజెంటేటివ్ పదవికి జి. నాగసునీత, లేడీ కమిటీ మెంబర్‌గా ఎం.సరోజిని, కమిటీ మెంబర్లు కె.ఏడుకొండలు, ఎం.ఎ.ఎస్.ఎస్.బాబు, యు.ఉమాగౌరీ, బిందు శ్రీ వేమూరి సింగిల్ నామినేషన్ దాఖలు చేయడంతో వారి ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది.

జనరల్ సెక్రటరీ పదవికి ఇద్దరు పోటీ

ఇప్పటి వరకు జనరల్ సెక్రటరీగా చక్కా ఎస్‌వీఎస్ శ్రీనివాస్ ఏడాది పాటు సేవలందించారు. ఈ ఏడాది మళ్లీ అదే పదవికి ఆయనతో పాటు ఓబులశెట్టి సత్యనారాయణ నామినేషన్ వేశారు. శుక్రవారం జరిగిన స్క్రూటినీలో ఓబులశెట్టి సత్యనారాయణ నామినేషన్ తిరస్కరించారు. దీంతో జనరల్ సెక్రటరీగా చక్కా ఎస్‌వీఎస్ శ్రీనివాస్ ఏకగ్రీవమయ్యారు. ఈనెల 11న (శనివారం) నామినేషన్ ఉపసంహరణకు గడువు ఇవ్వగా, ఈ నెల 17న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి టీపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు.

ఉపాధ్యక్ష పదవికి 17న ఎన్నిక

ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్ష పదవికి కేవీ భద్రరావు ఏడాది పాటు సేవలందించారు. ఈ ఏడాది మళ్లీ అదే పదవికి ఆయనతో పాటు సుధిన శ్రీనివాస్ నామినేషన్ వేశారు. వీరు మధ్య ఎన్నిక జరగనుంది.



ముత్తింటి విశ్వేశ్వరరావు, అధ్యక్షుడు



చక్కా ఎస్‌వీఎస్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



ఎన్నికల విధులపై సమీక్షిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లపై స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సెక్టార్ అధికారులతో సమీక్షించారు. అనంతరం స్మార్ట్‌సిటీ కార్యాలయంలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులతో ఆర్వో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందురోజు 12వ తేదీన మెక్లారిన్ స్కూల్ ఆవరణలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు ఆయన సూచనలు ఇచ్చారు. ఈవీఎంలతో పాటు ఇతర సామగ్రిని ఆయా పోలింగ్ స్టేషన్లకు తరలించే క్రమంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఇతర అంశాలపై తీసుకోవలసిన జాగ్రత్తలను అక్కడ ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులకు ఆదేశాలిచ్చారు. అలాగే 13వ తేదీన పోలింగ్ అనంతరం ఈవీఎంల తరలింపు, ఇతర అంశాలకు సంబంధించి జేఎన్‌టీయూకే ఆవరణలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్ వద్ద కల్పించాల్సిన విద్యుత్, సౌండ్ సిస్టమ్, ఇతర సదుపాయాలపై చర్చించి ఆదేశాలిచ్చారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తకుండా సజావుగా జరిగేలా ప్రతి ఉద్యోగి కష్టించి పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్వో చల్లన్నదొర ఇతర అధికారులు పాల్గొన్నారు.

కన్నబాబును గెలిపించండి : శెట్టిబత్తుల

కాకినాడ రూరల్: జిల్లా వాసులు వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ అభ్యర్థి కురసాల కన్నబాబు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోనసీమ జిల్లాకు చెందిన శెట్టిబత్తుల రాజబాబు పిలుపు ఇచ్చారు. కన్నబాబుకు మద్దతుగా ప్రచారంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన శుక్రవారం కాకినాడ 1వ డివిజన్ పరిధిలో కురసాల కల్యాణ్ కృష్ణతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. కూటమి పేరుతో అధికార దాహంతో చంద్రబాబు ప్రజలను మోసం చేసేందుకు హామీలు ఇస్తున్నారని, ఆయన మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ అర్బన్ 1వ డివిజన్‌లో కురసాల కల్యాణ్ కృష్ణతో ఎన్నికల ప్రచారంలో రాజబాబు

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ, జనసేన నాయకులు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కన్నబాబు

కరప: మండలం వాకాడ గ్రామానికి ప్రచారానికి వచ్చిన కన్నబాబు సమక్షంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయా పార్టీల నాయకులు పనితీరు, అనైతిక పొత్తు నచ్చక, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే కన్నబాబు చేసిన అభివృద్ధి పనులు, ప్రజల పట్ల చూపిస్తున్న ఆదరాభిమానాలకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్టు సదరు నాయకులు తెలిపారు. వాకాడ సర్పంచ్ అడబాల సత్య, ఉప సర్పంచ్ మోకన ధనరాజు, అడబాల ప్రసాద్, మోకన రాంబాబుల ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు మేడిశెట్టి రాంబాబు, పెంకే విశ్వేశ్వరరావు, పెంకే శ్రీనివాస్, గుత్తుల వెంకటరమణ, మారెళ్ల అనీష్, ఆలపాటి బాబీ, సిద్దుల తరుణ్, ఆలపాటి జీవరత్నం, మారెళ్ల సంజయ్‌కుమార్ తదితరులు 80 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ఎన్నికలకు మూడు రోజులే మిగిలాయని, అందరినీ సమన్వయం చేసుకుంటూ జగనన్నను ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా ఎన్నికల ప్రచారం చేయాలని ఎమ్మెల్యే కన్నబాబు కోరారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

కాకినాడ రూరల్: రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి వైఎస్సార్ సీపీలోకి పలువురు చేరారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు సోదరుడు కల్యాణ్‌కృష్ణ సమక్షంలో రమణయ్యపేట ఐశ్వర్యనగర్‌కు చెందిన కట్టా జగన్‌మోహన్ కిశోర్ ఆధ్వర్యంలో రాయుడు శ్రీను, పెంకే గణేష్, కొండయ్య, నూకరాజు, శ్రీను తదితర 20మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.



కురసాల కల్యాణ్ కృష్ణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ఐశ్వర్యనగర్ వాసులు